# సారే జహాఁసే అచ్ఛా

**భాగ్యనగరం కలత నిద్రలో జోగుతున్న వేళ - అప్పుడే తన రాక్షస రెక్కల్ని విప్పి 'టపటప' లాడిస్తూ బద్ధకంగా వళ్ళువిరిచి లేచి నించున్న మతమహమ్మారి విచ్చుకత్తుల విన్యాసాలతో మళ్లీ నరమేధానికి సిద్ధమైంది!**

భయంతో నిద్రరాక ప్రాణాలు అరచేత పట్టుకొని కిటికీల్లోంచి వీధులకేసి బేలగా, జాలిగా చూస్తున్నాయి వేలాది జతల కళ్లు. ఏ క్షణాన ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో? ఏ నిమిషంలో గూండాల దాడికి తాము బలి పశువులు కావాలో కూడా తెలియక భయంతో కుమిలిపోతున్నారు భాగ్యనగర ప్రజలు.

గంట క్రితమే పాత బస్తీలో దుండగులు జరిపిన దహనకాండలో అగ్నికి ఆహుతయిన భవనాలు, షాపులూ యింకా పొగలు విరజిమ్ముతూనే వున్నాయి. బాంబు దాడులకు గురైనట్టు ఆ ప్రాంతమంతా స్మశానంలా మారిపోయింది.

మృత్యువును ఆహ్వానిస్తున్నట్టున్న ఆ భయానక నిశ్శబ్దంలో మదీనా ప్రక్కనే వున్న ఓ ఎత్తైన భవనం రెండో అంతస్తులోంచి మైకులో బిగ్గరగా ఓ కవి కంఠం ఖంగున మ్రోగింది.

"మత సహనానికి మారు పేరైన
కుతుబ్ షాహీల ఆత్మలు —
గోరీల్లోంచి కూడా అదిగో
విషాద గీతాలు ఆలపిస్తున్నాయి...
భాగ్యనగర వీధుల్లో
విచ్చుకత్తులు గుచ్చుకొంటున్నాయి
మృత్యువు వడిలో శవాలు మాత్రం
మతం మరచి ఒదిగిపోతున్నాయి..."

యూసుఫ్ దాదా —

పటా కత్తులతో మూకను వెంటేసుకొని చార్ మినార్ వేపు తరలిపోతూ దారిలో కవి గీతం విని మంత్రించినట్టు అక్కడే నిలబడిపోయాడు. చింత నిప్పుల్లా మండుతున్న యూసుఫ్ దాదా కళ్లలో క్రూరత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నములుతున్న జర్దా కిళ్ళీని కాండ్రించి ఉమ్మేసి పర్వతం లాంటి శరీరాన్ని పక్కకు తిప్పి తీక్షణంగా చూస్తూ అడిగేడు - "క్యారే ఉస్మాన్ ... కౌన్ హై ఓ గానే వాలా బద్మాష్?"

అతడి బొంగురు గొంతులోంచి ఆ మాటలు వెలువడీ వెలువడక ముందే వినయంగా జవాబిచ్చాడు ఉస్మాన్. "జీ సర్కార్ ... వహీ ఆద్మీ హై. కవి ... కవి..."

అవును. అతడు కవి. అతడి పేరు కవి. కులం, మతం, వృత్తీ అన్నింటికీ అతడిచ్చే జవాబు 'కవి.' భార్య పేరు కవి భార్య. కవిత్వాలు పిల్లలంటాడు. మత సహనం తన కిష్టమైన కవితా వస్తువంటాడు. ఉర్దూ, తెలుగులో కూడా మత విద్వేషాలను ద్వేషిస్తాడు ...

"ఉర్దూ మే భీ హంకూ గాలీ దేతా? అచ్ఛా ... సాలే కా కామ్ బాద్ మే కరూంగా. పెహ్‌లే అప్నా సియాసీ కామ్ ..." అని — నర్మగర్భంగా నవ్వుతూ అడుగు ముందుకు వేసేడు యూసుఫ్ దాదా. అతడి కదలికలే ఆజ్ఞలుగా దాదా మూక మొత్తం అతడి వెంట కదిలింది.

***

చార్ మినార్ పక్కనే వున్న ఓ మారుమూల గల్లీలో నించి పరిసరాలు గజగజలాడేలా ఓ ఆర్తనాదం ... ఎవరో పసికందు భయంతోనో, లేక ఏ కసాయి కత్తి వేటుకో తన చిన్నారిగొంతు చించుకొని 'కెవ్వు'న వేసిన పెనుకేక హృదయ విదారకంగా వినిపించింది. అన్ని మతాల వారూ సమిష్టిగా విందూ, పొందూ ఆరగించిన ఓ వేశ్య కడుపులో మతం దించిన కత్తి మెహిందీలో స్త్రీ గావుకేక! ఒక తల్లి - వక్షోజాలు కోయబడి మృత్యువుకు చేరువలో గిలగిలా తన్నుకొంటుంది...

మదీనా ముందు చెల్లా చెదురుగా పడి వున్న తినుబండారాల కోసం వీధి కుక్కలు కాట్లాడుకొంటున్నట్టుంది.

ఎక్కడో పోలీసులు కాల్పులు జరుపుతున్నారు. కవి కళ్లు చెమ్మగిల్లాయి. కన్నీటి పొరల మసకలో గిరున వెనక్కు తిరిగి — స్పీకర్ను కిటికీలో పెట్టి దీర్ఘంగా నిట్టూరుస్తూ కవి భార్యకేసి సాలోచనగా చూసేడు.

కవి భార్య గుండె ఎగిసి పడుతోంది. ఆమె భయపడుతూందో, బాధపడుతూందో కూడా అర్థం కాలేదు.

కవి చిరునవ్వు నవ్వుతూ అడిగేడు. "భయమా?"

"నహీ..."

"బాధా...?"

ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థంకాక కవి భార్య లోలోపలే మధన పడుతున్నట్టుంది. కవి గ్రహించాడు. గట్టిగా శ్వాస పీల్చి వదిలి — "పగ్లీ ... జిందగీ సిర్ఫ్ ఫూలోం సే హీ నహీ చలేగా ... కభీ, కభీ కాటోం మే భీ చల్నా పడేగా" - కవి అదోలా నవ్వేడు. పరిస్థితులనే శాశించగలనన్నంత ధీమా అతడి నవ్వులో కనిపించింది.

దూరంగా వున్న దేవాలయం నించి గుడి గంటల చప్పుడు లయబద్ధంగా వినిపిస్తుండగా, గాలి తరంగాల వెంట ఎక్కడి నించో రిథమిగ్గా "అల్లాహో ... అక్బర్ ..." కర్ణేంద్రియాలకు సోకి ఆహ్లాదం కల్గిస్తుంటే క్షణకాలం దీక్షగా విన్న కవి భార్య ఏదో తాత్విక చింతనకు లోనైపోయినట్టుంది. మనసుకు ప్రశాంతత దొరికినట్టుంది. ఆందోళన తొలగి పోయింది కాబోలు — ఆరాధనగా కవి కేసి గర్వంగా చూస్తూ అలాగే నిలబడిపోయింది.

***

"జై భజరంగ్ బలీ ..." పెద్దగా ఆంబోతు రంకెవేసినట్టు అరిచేడు పాండూ దాదా! దాదా నినాదానికి ప్రతిస్పందించిన అతడి వందలాది మంది అనుచరులు "జై ... జై భజరంగ్ బలీ ..." అని వంతపలికారు. జైత్ర యాత్రకు అదే సంకేతం అన్నట్టు పాండూ దాదా మూక రెట్టించిన ఉత్సాహంతో చార్ మినార్ కేసి కదిలింది. మత రణోత్సాహంతో, నరమేధమే జీవిత లక్ష్యంగా కదం తొక్కుతూ పాండూదాదా మూక వీరావేశంతో కదిలింది.

## చూడలేక చార్‌మినార్

పరిగ్గ మదీనా దగ్గిర —

"శివమెత్తిన మత వాదపు
పిశాచాలు వీళ్లంతా
జబ్బు ముదిరి నయం కాక
నడి వీధుల కెక్కారట
శస్త్రచికిత్స చెయ్యాలిక
సుశ్రుతుడా దిగిరా
మత రోగుల చికిత్సకై
ధన్వంతరీ కదలిరా..."

ఫెళఫెళా రావాలతో ఆకాశం కూలి తల మీద పడ్డట్టు అదిరిపడ్డాడు పాండూ దాదా. అతడి అడుగులు నిల్చిపోయాయి. అతడితో పాటే పాండూ దాదా మూక మొత్తం 'సావధాన్' పొజిషన్లో శిలాప్రతిమల్లా నిల్చుండిపోయారు.

"అరే యాద్గిరీ ... గా మైక్లా వొర్లుతుంది కవి సాలేగాడేనా?" మీసం మీద చెయ్యి వేస్తూ అడిగేడు పాండూ దాదా.

"ఔ మల్ల గాడే ... తిరకాస్జేస్తుండు . మత సహనం, మత సహనం అంటూ దినాం వొర్లుతుండు" కసిగా చెప్పేడు యాదగిరి.

"పాగల్ గాడా ఏం?"

"పాగల్ గాడెట్లవుతడే ... మందిని భట్కాయించుడూ, కొట్లాట లొద్దనుడూ ... గంతెందుగ్గాన్ని పాండన్నా నువ్వే సమజ్జేస్కో ... పోరగాళ్లెంత మంది ఈ దినాం జులూస్‌కు రాలేదో" వివరించాడు యాదగిరి.

"కవి గాడేనా భట్కాయించింది?" క్రూరంగా చూస్తూ అడిగేడు పాండూ దాదా.

"ఔ .... ఆ సాలెగాడె."

సరిగ్గా కవిని గురించి ఆ చర్చ జరుగుతున్నప్పడే - పాండూదాదా మూక రంగంలోకి దిగిందన్న వార్త యూసుఫ్ దాదా చెవికి సోకింది. యూసుఫ్ దాదా ఒళ్లు పులకరించింది. పాండూదాదా ఆధిపత్యాన్ని

గోపరాజు నాగేశ్వరరావు



అంతంచేసి 'నెంబర్‌వన్ దాదా'గా నిలబడాలన్న తన చిరకాల వాంఛను నెరవేర్చుకొనేందుకు అప్పటికప్పుడే మనసులో పథకం వేసేడు యూసుఫ్ దాదా. పాండు ముఠాతో వీధి పోరాటానికి తన ముఠాను సమాయత్తం చేసి చార్‌మినార్ వేపు నించి మదీనా కేసి కదిలేడు.

రెండు ముఠాలూ దగ్గిరవుతున్న కొద్దీ అప్పటి దాకా జేబిల్లో, చొక్కాల కింద రహస్యంగా దాగిన కత్తులు, చైన్లు, యినపరాడ్లూ, తల్వార్లూ చేతుల్లో కొచ్చేసేయి. తన ముఠాకు ముందు యూసుఫ్ దాదా పెద్దపెద్ద అడుగులేస్తూ ఆకలిగొన్న పులిలా కదిలి వస్తుంటే — ఇవతలి వేపు ముఠ నాయకుడు పాండూ దాదా తన రెండు చేతుల్లో రెండు తల్వార్లు పట్టుకొని తిప్పతూ — "అరే యూసుఫ్ బేటా ... ఆజ్ మైనే తుఝేమార్ డాలూంగా" అని రంకెలేస్తూ యూసుఫ్ కేసి ఆకలిగా చూసేడు.

"తేరీ ..." యూసుఫ్ దాదా తిట్టిన తిట్టు మధ్యలోనే వినిపించకుండా మైకులో మళ్లీ కవి కంఠం ఖంగున మ్రోగింది.

*"పిశాచిగణాలు మతోన్మత్తులై*
*కత్తులతో నృత్యం చేస్తూ*
*సాటి మనిషి గుండెల్లో*
*పిడిబాకులు గుచ్చుతుంటే*
*చూడలేక చార్‌మినార్*
*సిగ్గుతో తలదించుకుంది..."*

యూసుఫ్ దాదా, పాండూ దాదా ఇద్దరూ ఒకే సమయంలో తలలెత్తి కవి ఇంటికేసి చూసేరు. కిటికీ దగ్గిరే స్పీకర్ను చేత్తో పట్టుకొని కవిత్వం చెప్తున్న కవిని చూసేరు. ఇద్దరూ ఒకే సమయంలో ఒకళ్ల కేసి ఒకళ్లు చూసుకోవడంతో దాదాలిద్దరి చూపులూ కలిసేయి. క్షణకాలం మౌనం తర్వాత వుండబట్టలేక కాబోలు "దేఖరే యూసుఫ్ భాయ్ కవి సాలా క్యా బక్తా హై" అని హెచ్చు స్వరంతో పెద్దగా అరిచి చెప్పేడు పాండూదాదా.

యూసుఫ్ దాదా సాలోచనగా తల పంకించి — "మై భీ సునా థా ... భర్గయి సాలేకూ. హమారా లోగోంకో భీ భట్కా రహా ... ఇస్కే ..." కోపంలో ఆపై తిట్టలేకపోయాడు యూసుఫ్ దాదా.

"అరే యాద్గిరీ!" పిల్చాడు పాండుదాదా.

"జీ సర్కార్..."

"కవిగాన్ని బజాయించుకుంటూ గుంజుకురాంఁడి పోంఁడి ..." ఆజ్ఞాపించేడు పాండు.

పదిమంది గూండాలను వెంట పెట్టుకొని యాదగిరి క్షణంలో కవి ఇంట్లోకి దూరేడు. అడ్డం వచ్చిన కవి భార్యను "చల్ ... హట్" అని — ఒక్క తోపు తోసేడు యాదగిరి. ఆ తోపుకు కవి భార్య బంతిలా ఎగిరి దూరంగా పడిపోయింది.

కవి ముఖం మీద పిడిగుద్దు గుద్దేడు యాదగిరి. కవి నోటి వెంట భళ్లున రక్తం చిమ్మింది. "చల్ సాలే..." పెడరెక్కలు విరిచిపట్టుకొని చేతుల్తో కుమ్మతూ కవిని బయటకు లాక్కొచ్చి పాండు దాదా కాళ్లమీద పడేశాడు యాదగిరి.

మరణ వేదనతో గిలగిల్లాడుతున్న ఎలకను చూస్తూ పిల్లి వినోదం పొందినట్టు నోటెంట రక్తం కారుతున్న కవిని క్షణం సేపు పరీక్షగా చూసి — "గిప్పుడు చెప్తవారా కవిత్వం?" అడిగేడు హేళనగా పాండు దాదా. అతడి నవ్వుతో యూసుఫ్ దాదా కూడా శ్రుతి కల్పాడు.

అప్పుడే కొంచెం తేరుకున్న కవి బలం పుంజుకుంటూ మెల్లిగా లేచి నిలబడి గొంతు సవరించుకున్నాడు.

*"ప్రతి సంధ్యా నారింజరంగు నీరెండలో*
*ప్రకృతి కుమ్మరించే బంగారు నీటిలో తడిసి*
*ధగధగాయమానంగా వెల్గులు విరజిమ్మే*
*చార్మినార్ను ఎందుకురా యింత క్షోభ*
*పెడతారు?"*

కవి ప్రశ్న దాదాల గుండెల్లో సూటిగా నాటుకున్నట్టుంది. యూసుఫ్ కోపం పట్టలేక రెండే రెండు అంగల్లో కవి దగ్గిరకు వచ్చి ముఖం మీద బలంగా గుద్దేడు. పాండుదాదా పిడికిలితో కవి పొట్టలో పొడిచేడు.

కవి మళ్లీ కిందపడిపోయాడు.

పాండుదాదా ఆవేశంతో రొప్పుతూ యూసుఫ్ దాదా వేపు చూసి - "యూసుఫ్ భాయ్ ఏ సాలే హమేషా చార్మినార్ ... చార్మినార్ బక్తాహై. సాలేకూ చార్మినార్ కే పాస్ ఖతం కర్ డాలేంగే" అని ధృడంగా చెప్పాడు. కవి భవితవ్యం గురించి ఆ ఇద్దరు దాదాలూ తీసుకున్న నిర్ణయం అమలుజరగాల్సిందే మరి!

దానవత్వం పరాకాష్టకు చేరి అవధులు దాటిన మతోన్మాదం సాటి మనిషి రక్తంతో స్నానం చేద్దామని మనిషే తపన పడిపోతుంటే — తమ పిల్లల్ని తామే కొరుక్కుతినే క్రూరమృగాలు సైతం మనుషుల్ని చూసి చీదరించుకొని, నిర్ఘాంతపోతున్న వేళ —

యూసుఫ్, పాండు ఇద్దరూ కలిసి కవిని చెరో రెక్క పట్టుకొని కొట్టుకుంటూ చార్‌మినార్ వేపుకు లాక్కుపోతున్నారు.

చార్‌మినార్ ఇంకా పదడుగుల దూరంలో వుండనగా పాండూ దాదా కవిని మళ్లీ అనునయంగానే అడిగేడు -

"చెప్పరా కవీ ... ఏం జేసిన మని మమ్మల్నిట్ల సతాయించుదు?"

కవి నీరసంగా జవాబు చెప్పేడు.

*"గువ్వలా తల్లి పొత్తిళ్లలో ఒదిగి*
*పాలు తాగే ఆ పసికందు గుండెలో*
*కసితో దించిన*
*ఆ కసాయి కత్తినడుగు."*

"ఛీ ... సాలా ... తేరీ ..." అని ఆవేశంతో వూగిపోతూ స్రరున కత్తి తీసి కవి గుండెలో పొడిచేడు పాండు దాదా.

"సాలే ... అబ్‌తో భీ బోల్" చార్మినార్ ప్రతిధ్వనించేలా పెద్దగా అరిచాడు యూసుఫ్ దాదా.

మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా విప్పుతూ కళ్లు చికిలించి చూసేడు కవి. అతడి నోటి వెంట అస్పష్టంగా మాటలు వెలువడుతున్నాయి.

"ఓ తల్లి వక్షోజాలు కోసి
ఓ చెల్లి నొసటి కుంకుమ చెరిపి
రాక్షసుల్లా మీరు చేసిన
వికటాట్ట హాసాల నడుగు..."

"థూ ... సాలేకూ షరమ్ నహీ హై" అంటూ యూసుఫ్ దాదా తల్వార్‌తో కవిని బలంగా పొడిచేడు.

కవి కళ్లు తేలిపోతున్నాయి. కళ్లముందు నక్షత్రాలు మెరుస్తున్నాయి. వళ్లు దూదిపింజంలా తేలిపోతున్నట్టుంది. మైకం కమ్ముకొచ్చి భూమ్మీద ఒరిగిపోతూ కడసారి తృప్తిగా చార్‌మినార్ కేసి ఆరాధనగా చూస్తూ ప్రాణాలు విడిచాడు కవి.

పోలీసు వాహనాలు సైరన్లు మోగిస్తూ వాయు వేగంతో వచ్చి చార్‌మినార్ దగ్గర ఆగేయి. బిలబిలా దిగిన పోలీసులపై రాళ్ల వర్షం కురిసింది. పోలీసులు కాల్పులు జరిపారు. ఇద్దరు దాదాలకూ చెందిన రెండు ముఠాల్లోనూ ఎంతోమంది తూటాలు తగిలి కిందపడిపోయారు.

ఆశ్చర్యం!

యూసుఫ్ దాదా కానీ, పాండూ దాదా కానీ ఇద్దరూ కనిపించలేదు. పోలీసులకు అందిన సమాచారం ప్రకారం యూసుఫ్ దాదా తన మోటారు సైకిల్ వెనుక పాండూ దాదాను ఎక్కించుకొని ఇద్దరూ కలిసి కొత్త బస్తీ వేపుకు పారిపోయేరు. ●

## 1990 త్వరగా వెళ్లు



వెళ్లు వెళ్లు
త్వరగా వెళ్లు
ఏముంది చెప్పటానికి
ముడుచుకున్న మూతి విప్పటానికి
ఎద ఎదలో కత్తి పోట్లు
ఎక్కడ తగిలాయో చెప్పటం తప్ప.
వెళ్లు వెళ్లు
త్వరగా వెళ్లు
ఏడుపు దినవారాలై
తూరుపు దిక్కు ఆశగా చూడటం తప్ప

—డాక్టర్ బి.దామోదర్‌రావు

## అపురూప ఛాయా చిత్రం...



'SUNBIRD FEEDING YOUNG ONE'
Photo: MANSINGH.S

## 'జడలో జాబిలి, స్టూవర్ట్‌పురం పోలీస్ స్టేషన్' బహుమతి విజేతలకు మనవి

ఈ రెండు సీరియల్స్‌పై మేము నిర్వహించిన పోటీలో విజేతలయిన వారికి బహుమతులు ఎప్పుడు - ఎక్కడ అందజేసేదీ వివరిస్తూ ఉత్తరాల ద్వారా తెలియజేస్తున్నాం. బహుమతి అందుకోవడానికి వచ్చినప్పుడు మేము రాసిన లేఖల్ని విధిగా చూపించాలి. గమనించమనవి.

— ఎడిటర్

టి.వి.లను బహూకరిస్తున్నవారు

Siddhartha TV

SIDDHARTHA ELECTRONIKS
(A WONDER LAND IN ELECTRONICS)

కోనేరుమూడివారి వీధి, సూర్యారావు పేట,
విజయవాడ - 2. ఫోన్ నెం: 66364